ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 31 మార్చి 2024


రథంపై కొలువుదీరిన స్వామివారు

భక్తజన సంద్రం

- అంగరంగ వైభవంగా ఖాద్రీశుడి రథోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- గోవిందనామ స్మరణతో మార్మోగిన కదిరి వీధులు

వివరాలు 7లో...

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం శనివారం కన్నుల పండువగా సాగింది. ఈ తేరు మహోత్సవాన్ని చూడటానికి వేలాదిగా భక్తులు పోటెత్తారు. కదిరి చుట్టుపట్లే కాకుండా కడప, చిత్తూరు, కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు తరలిరావడంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచే తిరువీధుల్లో సందడి నెలకొంది. శనివారం ఉదయం అశేష భక్తజన వాహిని నడుమ శ్రీవారి తేరును ఆలయ అధికారులు, నిర్వాహకులు ముందుకు కదిలించారు. ఈ కదిలే తేరుపై భక్తులు దవనం, మిరియాలు చల్లారు. తేరు కదులుతున్న సమయంలో తిరువీధులన్నీ గోవింద నామస్మరణతో మార్మోగాయి. దాదాపు నాలుగున్నర గంటలకు పైగా సాగిన స్వామివారి రథయాత్ర ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముగిసింది. యువతీ, యువకులు రథోత్సవాన్ని సెల్‌ఫోన్‌లలో బంధించడానికి, సెల్ఫీలు తీసుకోవడానికి ప్రయత్నించారు. రథోత్సవం సందర్భంగా పలుచోట్ల అన్నదానం చేశారు.




కుటాగుళ్ల దేవర ఎద్దు ఊరేగింపు


ఎండ వేడిమికి గొడుగుచాటున...


దవనం, మిరియాలకు భలే డిమాండ్


దేవదేవుడి దర్శనం కోసం మేడలపై...

చిత్రవధ

- చిత్రావతి నుంచి యథేచ్ఛగా ఇసుక తరలింపు
- చూసీచూడనట్లు ఉంటున్న అధికారులు
- భూగర్భ జలాలు అడుగంటిపోతాయని స్థానికుల ఆందోళన


చిత్రావతి నది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

పుట్టపర్తి, మార్చి 30: ఇసుక కోసం కొంతమంది అనుమతులు లేకుండా చిత్రావతి నది గర్భాన్ని తోడేస్తున్నారు. యథేచ్ఛగా సాగుతున్న ఈ ఇసుక తరలింపుతో నదిలో ఇసుక రేణువులు లేకుండా ఖాళీ అవుతోంది. అధికారం అండతో కొందరు చేస్తున్న ఈ దోపిడీ వల్ల వందల గ్రామాలకు నీరు లేకుండా పోయే ప్రమాదం ఏర్పడుతోంది. అధికార పార్టీ నాయకులు మాత్రం ఎవరికి వారే రాత్రికి రాత్రి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

సామాన్యులకు భారం.. బడా వ్యక్తులకు లాభం

చిన్న ఇల్లు కట్టుకోవాలన్నా సామాన్యులకు ఇసుక దొరకడం కష్టంగా మారింది. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ఇసుకను సమకూర్చుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. కేవలం ఇసుక కోసమే వేలకు వేలు వెచ్చించాల్సి రావడం వారికి భారంగా మారుతోంది. అయితే బడా వ్యక్తులు మాత్రం అధికార పార్టీ అండదండలతో ఇష్టారాజ్యంగా చిత్రావతిలో ఇసుకను తోడేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈక్రమంలోనే కొంతమంది పగలు రాత్రి తేడా లేకుండా చిత్రావతి నుంచి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

మొక్కుబడిగా దాడులు

నదుల్లో ఇసుకను ఇష్టారాజ్యంగా తరలిస్తే భూగర్భజలాలు అడుగంటి పోయి, తాగునీటికి సైతం ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు మొద్దు నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో అన్నిశాఖల అధికారులు ఉన్నా.. తమ కార్యాలయాలకు దగ్గరలో చిత్రావతి నుంచి యథేచ్ఛగా ఇసుక తరలివెళ్తున్న చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదో మొక్కుబడిగా ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకుని జరిమానాలతో వదిలేస్తున్నారన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తు న్నాయి. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే సుదూర ప్రాంతాలలో అధికారులు ఏమి దాడులు చేస్తారో అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

కర్ణాటకకు తరలుతున్న ఇసుక

జిల్లాకు ఎక్కువ సరిహద్దు ప్రాంతం కర్ణాటక రాష్ట్రం ఉంది. అక్కడ ఇసుక కొరత ఉం డటం, జిల్లాలో చిత్రావతి, పెన్నాలో ఎక్కువగా ఇసుక లభిస్తుండటం వ్యాపారులకు కలిసి వచ్చింది. రాత్రిళ్లు ఇసుక ట్రక్కులను సరిహద్దులు దాటించేస్తున్నారు. ఉ న్నతాధికారులు చిత్తశుద్ధితో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



బకాయిలు చెల్లించాకే ఓట్లు అడగాలి

- పట్టు రైతు సంఘం నాయకులు


మాట్లాడుతున్న పట్టురైతులు, రీలర్లు

హిందూపురం అర్బన్, మార్చి 30: రైతులకు బకాయిలు చెల్లించిన తర్వాతే జగన్ ఓట్లు అడగాలని ఏపీ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. స్థానిక పట్టుగూళ్ల మార్కెట్‌లో శనివారం పట్టు రైతుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల సందర్భంగా పట్టు రైతులను ఆదుకుంటానని చెప్పిన జగన్ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఉన్న పది లక్షల మంది రైతులను మోసం చేశారని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి రాగానే రైతులకు బకాయి ఉన్న రూ. 4 కోట్లు అందిస్తానని అంటే నమ్మి ఓట్లేశాం. అయితే గెలిచాక ఆయన రైతులను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బైవోల్టిన్ పట్టు రైతులకు రూ. 100 ఇన్‌సెంటివ్ ఇస్తామన్నారు. అది కూడా చెల్లించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది రైతులు, రీలర్లు ఉన్నారన్నారు. ఈ ఐదు సంవత్సరాల్లో దాదాపు రూ.60 కోట్లకు బకాయిలు పెరిగాయని, వాటిని చెల్లించకపోతే పట్టురైతుల తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. 2024 ఎన్నికల్లో మోసపోవడానికి తాము సిద్ధంగా లేమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సిద్దారెడ్డి, రైతు సంఘం నాయకులు శంకర్, రాజేష్, రామకృష్ణారెడ్డి, కోడిపల్లి రామాంజప్పరీలర్ల సంఘం నాయకులు సనావుల్లా, ఖాజ తదితరులు ఉన్నారు.

కోడ్ ఉంటే ఏంటి..?

పుట్టపర్తి, మార్చి 30

ఎన్నికల కోడ్ అమలులో ఉంటే మాకేంటి అనేలా ఉంది వైసీపీ నాయకుల తీరు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దుద్దుకుంట ఫౌండేషన్ పేరుతో తాగునీటి పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే తన సొంత మండలమైన నల్లమాడ పరిధిలోని ఎద్దులవాండ్లపల్లి తండా లో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వాటర్‌ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేపట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే సతీమణి అపర్ణారెడ్డికి గ్రామస్థులు నీటి సమస్యను వివరించినట్లు సమాచారం. ఈక్రమంలోనే మీకు నీళ్లిస్తాం.. మాకు ఓటువేయాలంటూ వారిని కోరినట్లు తెలిసింది. ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభ పెట్టరాదన్న ఎన్నికల సంఘం ఆదేశాలు ఈ చర్యతో బేఖాతరయ్యాయి. కోడ్ ఉల్లంఘనా జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.



నీరు పంపిణీ చేస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి చెందిన వాటర్‌ట్యాంకర్

తాగునీటికి ఇబ్బంది రానివ్వొద్దు

- సమీక్షా సమావేశంలో కలెక్టర్

ధర్మవరం, మార్చి 30: తాగునీటికి ఇబ్బంది లేకుండా పథకాలన్నీ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశపు భవనంలో శనివారం ఆయన తాగునీరు. ఉపాధి పనులపై డివిజన్‌లోని అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవా లన్నారు. తాగునీటిని ఇతర అవసరాలైన వాహనాలు, ఇంటి తోటలకు మళ్లించరాదన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాలలో చేతిపంపులను మరమ్మతులు చేయాల న్నారు. ఉపాధి కూలీలకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్తవేతనం అమలు చేసేలా కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఉపాధి కూలి రోజుకు రూ.300 పెరిగిన విషయాన్ని కూలీలకు వివరించాలన్నారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీఈ వెంకటనారాయణ, డ్వామా పీడీ విజయప్రసాద్, డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

రోజువారి నివేదికలను కమిషన్‌కు పంపాలి: కలెక్టర్

పుట్టపర్తి, మార్చి 30

ఇంటిగ్రేట్ కంట్రోల్‌రూం నుంచి రోజువారి నివేదికలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు పంపించాలని జిల్లా కలెక్టరు అరుణ్‌బాబు శనివారం ఓ ప్రకటనలో అధికారులను ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో ఇంటిగ్రేట్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని కలెక్టరు పేర్కొన్నారు, ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామన్నారు. ప్రింట్ మీడియా ద్వారా 78, డిస్ట్రిక్ కాల్‌సెంటర్ ద్వారా 1 ఫిర్యాదు రాగా వాటిని పరిష్కరించామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన 27 మంది వలంటీర్లు, ముగ్గురు కాంట్రాక్టు సిబ్బంది, ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు, ఒక రేషన్ డీలర్‌ను తొలగించినట్లు తెలిపారు.

ఉష్ణోగ్రతలు (శని)

	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	40.0	24.0
కదిరి	38.0	23.0
ధర్మవరం	39.0	24.0
హిందూపురం	38.0	23.0
పెనుకొండ	39.0	24.0

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.35 ఆదివారం (సాయంత్రం)	4.53 సోమవారం (ఉదయం)
కదిరి	6.31 ఆదివారం (సాయంత్రం)	5.01 సోమవారం (ఉదయం)
ధర్మవరం	6.37 ఆదివారం (సాయంత్రం)	4.57 సోమవారం (ఉదయం)
హిందూపురం	6.35 ఆదివారం (సాయంత్రం)	5.01 సోమవారం (ఉదయం)
పెనుకొండ	6.33 ఆదివారం (సాయంత్రం)	4.58 సోమవారం (ఉదయం)

భానుడి భగ భగ

అల్లాడిపోతున్న జనం



పుట్టపర్తి రూరల్, మార్చి 30: కనీసం ఏప్రిల్ నెల కూడా రాకముందే జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10 గంటలు దాటితే రోడ్లపైకి జనం రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నానికల్లా ప్రధాన రోడ్లు సైతం నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. జిల్లాలోని ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో సైతం 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఇక్కడకు వచ్చే విదేశీయులు వేడి, ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. గొడుగుల కోసం వెంపర్లాడుతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో శీతల పానీయాలు, కొబ్బరిబోండాలు, పుచ్చకాయలు వంటి వాటికి డిమాండ్ పెరిగింది.

అత్యవసరమైతేనే బయటకు..: ఎస్వీ కృష్ణారెడ్డి, డీఎంహెచ్ఓ

ఎండలు ఎక్కుగా ఉన్న దృష్ట్యా ప్రజలు తమ పనులను ఉదయం, సాయంత్రం వేళల్లోనే ముగించుకోవాలి. అత్యవసరమైతేనే మధ్నాహ్న సమయంలో బయటకు రావాలి. అప్పుడు కూడా తెల్లని, వదులుగా ఉన్న దుస్తులు ధరించాలి. గొడుగు అందుబాటులో ఉంచుకోవాలి. ఎండలో వెళ్లినపుడు నీరు బాగా తాగాలి. మజ్జిగ, కొబ్బరి బొండంనీరు, నిమ్మకాయ పానకం తాగాలి. ఎప్పుడైనా కళ్లు తిరిగినపుడు రోడ్డుమధ్యలో కాకుండా పక్కకు రావాలి. నీళ్లుతాగి కూర్చోవాలి. ఎండలో నుంచి ఇంటికి వచ్చినపుడు అలసట అనిపిస్తే సమీపంలో ఉన్న డాక్టరును వెంటనే సంప్రదించాలి.


గొడుగు నీడన విదేశీ మహిళ వడి వడి అడుగులు

ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడండి

- ఎస్పీని కోరిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు

పుట్టపర్తి రూరల్, మార్చి 30: సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేందుకు సహకరించాలంటూ ఎస్పీ మాధవరెడ్డిని కోరినట్లు తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లాపోలీసు కార్యాలయంలో శనివారం ఆయన ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలని, ప్రతి ఓటరు నిర్భయంగా.. స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలని ఎస్పీని కోరినట్లు చెప్పారు.


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు


నమో నారసింహా..!



ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీవారి బ్రహ్మరథోత్సవం (తేరు) శనివారం అత్యంత వైభవంగా జరిగింది. లక్షలాదిమంది తరలిరావడంతో తిరువీధులు కిక్కిరిసి పోయాయి. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అత్యంత ముఖ్యమైన ఈ రథోత్సవానికి కదిరి చుట్టుపట్ల నుంచే కాకుండా కర్ణాటక, రాయచోటి, పులివెందుల, కడప, మదనపల్లి, చిత్తూరు, తిరుపతి, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలి వచ్చారు. - కదిరి


దవనంతో యువతులు సిద్ధం.


అదిగో స్వామి..


పుణ్యాహవాచనం నిర్వహిస్తున్న వేదపండితులు


రథోత్సవంలో యువకుల విన్యాసం..

గోవిందా.. గోవింద!

కన్నుల పండువగా ఖాద్రీశుడి రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- గోవిందనామస్మరణతో మార్మోగిన తిరువీధులు
- 4.39 గంటల పాటు కొనసాగిన బ్రహ్మరథోత్సవం

కదిరి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం




గొడుగుల నీడలో..


ఇదిగో హారతి..


యువ భక్తుల కోలాహలం...


స్వామితో ఓ సెల్ఫీ..

తేరు సాగింది ఇలా..


ఉదయం 8.12 గంటలకు బ్రహ్మరథోత్సవం ప్రారంభమైంది. అంతకు ముందు వేద పండితులు రథారోహనం గావించారు. రథం వద్ద పుణ్యాహవాచనం, బలిహారణ, కుంభహారతి ఇచ్చారు. తర్వాత రథంలో స్వామివారి ఆరాధన, అక్షతారోహనం పూజలు చేసి, శ్రీదేవీ, భూదేవీ సమేతంగా శ్రీవారి విగ్రహాలను బ్రహ్మరథంపై కూర్చో పెట్టారు. అనంతరం భక్తులు తేరును లాగారు. తిరువీధుల్లో భక్తులు స్వామివారికి దవనం, మిరియాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. 9.00 గంటలకు చౌక్ వద్ద రథం కొద్దిసేపు ఆగిపోయింది. ఆ తర్వాత భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ ఉత్సాహంగా స్వామివారి రథాన్ని ముందుకు లాగారు. వెనుక వైపున కుటాగుళ్ళ, మూర్తిపల్లి, గజ్జలరెడ్డిపల్లి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు తెడ్లు వేయడం, మొద్దులు తొక్క డంతో వేగంగా ముందుకు కదిలింది. ఉదయం 9.30 గంటలకు రథం శివాలయం వద్దకు చేరుకుంది. అక్కడ వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. గండిబండ ఆంజనేయస్వామి వద్దకు పది గంటలకు చేరుకుంది. అక్కడ నుంచి పడమర రాజగోపురం, గొల్లమ్మ మంటపం, దవన మండపం మీదుగా హిందూపురం క్రాస్ చేరుకుంది. అరగంట పాటు అక్కడే రథం నిలిచిపోయింది. తిరిగి మధ్యాహ్నం 12.20 నిమిషాలకు భక్తుల గోవింద నామస్మరణతో రథం ప్రారంభమైంది. యువ భక్తులు రెట్టించిన ఉత్సా హంతో రథాన్ని లాగారు. మధ్యాహ్నం 12.51 నిమిషాలకు రథం యథాస్థానానికి చేరుకుంది. రథోత్సవం దాదాపు 4.39 గంటల పాటు కొనసాగింది. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి తదితరులు రథంపై ఉండి భక్తులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రథోత్సవం ప్రారంభంలో ఈఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రథోత్సవం ముగిసిన తరువాత రథం వెనుక మొద్దులు తొక్కిన కుటాగుళ్ళ, మూర్తిపల్లి, గజ్జలరెడ్డిపల్లి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులకు మొదటిగా శ్రీవారి దర్శనం కల్పించారు.

కిక్కిరిసిన కదిరి వీధులు

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవాన్ని వీక్షించడానికి శనివారం వేలాది భక్తులు తరలి వచ్చారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులతో కదిరిలోని వీధులన్నీ అదివారం అర్ధరాత్రి నుండే కిక్కిరిసి పోయాయి. ఆలయ ప్రాంగణం అంతా కాలు మోపడానికి కూడా వీలులేనంతగా భక్తులతో నిండి పోయింది. తేరుపై ఊరేగుతున్న శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు ఎండ వేడిమిని లెక్కచేయకుండా తిరువీధుల్లో మిద్దెలు ఎక్కి, రోడ్లపై నిలబడ్డారు. కదులుతున్న తేరుపై దవనం, మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. ఇక తేరు చక్రాల కింద గుమ్మడికాయలు సమర్పించారు. రథంపై నుండి కిందికి జాలువారిన మిరియాలను ఏరుకోవడానికి భక్తులు ప్రయత్నించారు. భక్తుల కోసం తిరువీధుల్లోనే కాకుండా పట్టణంలోని ప్రధాన వీధుల్లో అనేక రకాల దుకాణాలు వెలిశాయి. యువతీ, యువకులు రథోత్సవాన్ని సెల్‌ఫోన్‌లలో బంధించడానికి, సెల్ఫీలు తీసుకోవడానికి ప్రయత్నించారు. ఉత్సవం ముగిసిన తర్వాత ఆలయంలో శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించి, భృగుతీర్థంలో స్నానాలు చేసి శ్రీవారిని దర్శించుకున్నారు.


భానుడి భగభగల నడుమ..


రథంపై కందికుంట ప్రసాద్..


పుణ్యం.. అన్నదానం..

మాటరాని మౌనమిది..!

హామీలను నెరవేర్చని సీఎం జగన్

అందుకే రోడ్ షోలో అభివాదంతో సరి

ఎన్నికల సమయంలో అభ్యర్థులకు నిరాశ

అనంతపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కీలకమైన ఎన్నికల సమయంలో కరువు జిల్లాలో సీఎం జగన్ రోడ్ షో నిర్వహించారు. కానీ ఎక్కడా ఒక్క మాటా మాట్లాడలేదు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర చప్పగా సాగింది. గుంతకల్లు నియోజకవర్గంలోని గుత్తి నుంచి శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం సంజీవపురం వరకూ శనివారం రోడ్‌షో నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లోనూ జగన్ అభివాదంతోనే సరి పెట్టారు. మూగనోము పాటించారు. దీంతో పార్టీ అభ్యర్థులు, శ్రేణులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. సీఎం మౌనముద్రపై రాజకీయ విశ్లేషకులు సైతం పెదవి విరిచారు. జిల్లా మనవడినంటూ.. ఆయన అలివిగాని హామీలు ఇచ్చారు. మాట తప్పను... మడమ తిప్పను అన్నారు. కానీ ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదు.


గుత్తిలో బస్సుపై నిలబడి.. సీఎం జగన్ నమస్కారాలు

ఇవన్నీ మరిచారు..

- అనంతపురం జిల్లాలోని జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరందించేందుకుగానూ రూ.986 కోట్లతో పనులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకం కాలువల తవ్వకాలకు 1400 ఎకరాల భూమి అవసరంకాగా, 500 ఎకరాలకు రూ.200 కోట్లు వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లు గడిచినా రైతులకు పరిహారం అందలేదు.
- కృష్ణాజలాలను భైరవానితిప్ప ప్రాజెక్టుకు మళ్లిస్తామని హామీ ఇచ్చారు. నేటికీ పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. ఆ ప్రాజెక్టు పూర్తయితే రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని 12 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. హామీ నెరవేరలేదు.
- రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద 4 టీఎంసీల సామర్థ్యంతో టీడీపీ హయాంలో చేపట్టిన నేమకల్లు ఆంజనేయస్వామి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తయి ఉంటే బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హిరేహాళ్ మండలాల్లోని ఆయకట్టు భూములకు సాగునీరు, ఆ ప్రాంత ప్రజలకు తాగునీరు అందేది. ఇప్పటి వరకూ ఆ రిజర్వాయర్ ఊసేలేదు.
- ఉమ్మడి జిల్లాకు సాగు, తాగునీరందించే హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను ఐదేళ్లలో చేపట్టలేకపోయారు. ఈ హామీ గురించి పట్టించుకోలేదు.
- ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామాలను చాగల్లు రిజర్వాయర్ మునక గ్రామాలుగా గుర్తించారు. ఉల్లికంటిపల్లి ప్రజలకు పరిహారం కింద కొంత సొమ్ము మాత్రమే చెల్లించారు. ఉల్లికల్లు గ్రామంలో అభివృద్ధి పనులను పూర్తిగా నిలిపివేశారు.
- శింగనమల నియోజకవర్గంలో ఉద్యాన రైతుల ఆదాయం పెంచేందుకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గిట్టుబాటు ధర అందిస్తామని రైతులను నమ్మించారు. ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.
- వైసీపీ అధికారంలోకి వస్తే ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా ఉపకాలువల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీటిని అందిస్తామన్నారు. అదే నీటికోసం ప్రతిపక్ష నేత హోదాలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంపై ధర్నా చేశారు. ఐదేళ్లు గడుస్తున్నా ఒక్క ఉపకాలువ నిర్మాణాన్ని పూర్తి చేసిందిలేదు.
- హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులను నింపుతామన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని పాదయాత్ర సమయంలో హామీ ఇచ్చారు. నల్లమాడ బహిరంగసభలో ఇచ్చిన ఈ హామీ నేటికి కార్యరూపం దాల్చలేదు.
- ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని.. పాదయాత్రలో హామీ ఇచ్చారు. ఒక్క అడుగూ ముందుకు పడలేదు.
- 2019లో ఎన్నికల ప్రచారంలో భాగంగా హిందూపురానికి వచ్చారు. అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పట్టురైతులు, పట్టు రీలర్లకు అందిస్తున్న ప్రోత్సాహక మొత్తాన్ని కిలో రూ.50 నుంచి రూ.100కు పెంచుతామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ పెంచలేదు. పైగా రైతులకు ప్రోత్సాహక బకాయిలు రూ.50 కోట్ల మేర బకాయి ఉన్నారు.
- ధర్మవరంలో తయారైన పట్టుచీరలకు ఈ-కామర్స్ ద్వారా ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. 2019 డిసెంబరు 21న, జగన్ పుట్టినరోజు సందర్భంగా ధర్మవరంలో నిర్వహించిన చేనేత సభలో ఈ హామీ ఇచ్చారు. ఇంత వరకూ నెరవేరలేదు.
- మడకశిర నియోజకవర్గంలోని 127 చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణాజలాలు అందిస్తామని 2019లో హామీ ఇచ్చారు. ఇంత వరకూ మడకశిర చెరువుకు తప్ప... ఇతర మండలాలకు కృష్ణాజలాలు అందించలేదు. 2023 అక్టోబరు 4న రూ.250 కోట్లతో ఎవరెస్ట్ స్టీమ్ బిల్డింగ్ ప్రైవేట్ కంపెనీ నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇంత వరకూ దాని ఊసులేదు.
- రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి గ్రామ సమీపంలో దేవరకొండ జలాశయం సహా మూడు రిజర్వాయర్లకు 2020 డిసెంబరు 9న వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. రిజర్వాయర్లకు భూములు సేకరించే పనులు ప్రారంభం కాలేదు. దేవరకొండ జలాశయం పూర్తి చేసి పిల్లకాలువల ద్వారా చెన్నేకొత్తపల్లి మండల వ్యాప్తంగా 25 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది.
- ప్రజాసంకల్ప యాత్ర సందర్భంగా రాప్తాడు మండల కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రతిపక్ష నేత హోదాలో రైతుల కోసం రూ.4 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికి అమలు కాలేదు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు

గుడిబండ, మార్చి 30 : మండలంలోని కొంకల్లు గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వీరన్నకు షోకాజ్ నోటీసు అందజేసినట్లు ఎంపీడీఓ బంగారమ్మ శనివారం తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో వీరన్న వైసీపీ అభ్యర్థి వీరలక్కప్ప ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారని ఫిర్యాదు అందిందన్నారు. దీంతో షోకాజ్ నోటీసు అందజేసినట్లు తెలిపారు. ఈ విష యాన్ని మడకశిర రిటర్నింగ్ అధికారి, ఉపాధిహామీ సత్యసాయిజిల్లా పీడీకి నివేదిక అందజేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

వలంటీర్లు, డీలర్లపై చర్యలు

అనంతపురం టౌన్, మార్చి 30: ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిన మరో రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు గౌతమి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వజ్రకరూరు మం డలం గడేహోతూరు డీలర్ నాగరాజు వైసీపీ అభ్యర్థి తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, దీంతో విచారించి విధుల నుంచి తొలగించామని తెలిపారు. ఇప్పటి వరకు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు 40 మంది వలంటీర్లు, ఎనిమిది మంది డీలర్లు, 11 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఒక రెగ్యులర్ ఉద్యోగిపై చర్యలు తీసుకున్నామని కలెక్టరు తెలిపారు. సి-విజిల్ యాప్‌కు శనివారం ఐదు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 231 ఫిర్యాదులు వచ్చాయని, ఎప్పటికప్పుడు విచారించి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

బస్సుయాత్రలో వలంటీర్

అనంతపురం రూరల్: సీఎం జగన్ నిర్వహించిన రోడ్ షోలో అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన వలంటీర్ గణేష్ పాల్గొన్నాడు. రాజకీయ పార్టీల కార్యక్రమాలకు వలంటీర్లు దూరంగా ఉండాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా.. పలువురు ఖాతరు చేయడం లేదు.


బస్సుయాత్రకు వెళుతున్న వలంటీర్ గణేష్

వలంటీర్ల తొలగింపు

ఉరవకొండ: వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు కొల్లారప్ప, రంగప్పను విధులను తొలగించామని హావళిగి పంచాయతీ కార్యదర్శి సురేష్ శనివారం తెలిపారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున, వలంటీర్ జయన్న రాజీనామా చేశారని ఆయన తెలిపారు.

యానిమేటర్ ప్రచారంపై విచారణ

నల్లమాడ: వంకరకుంట పంచాయతీలో వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి అపర్ణ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో శుక్రవారం యానిమేటర్ 3 శకుంతల పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ మహమ్మద్‌దౌలా, ఏపీఎం జయంతి శనివారం గ్రామానికెళ్లి విచారించారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు.

వలంటీర్ ప్రచారం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ గంగాధర్

హిందూపురం: లేపాక్షి మండలం నాయనపల్లిలో శనివారం నిర్వహించిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో గంగాధర్ అనే వలంటీరు పాల్గొన్నాడు. ఇంటింటికీ వెళ్లి వైసీపీకి ఓటేయాలని కోరాడు.

ఇదిగో నా రాజీనామా...?

గోరంట్ల: బూదిలి పంచాయతీ గంగాదేవిపల్లిలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ బోయ రమేష్ శనివారం రాజీ నామా చేశారు. రెండురోజుల కిందట సర్పంచ్ రామాంజనేయులుతో కలిసి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. కార్యదర్శి గంగాధర్ నాయక్ ద్వారా ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ షోకాజ్ నోటీసును శుక్రవారం జారీ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఈనేపథ్యంలో అధికారులు తొలగించక ముందే సర్పంచ్ రామాంజునేయులు సమక్షంలో వలంటీర్ రమేష్ ఎంపీడీఓ కార్యాలయంలో రాజీనామా చేశారు. దానిని ఎంపీడీఓ ఆమోదించారు.

అంబికాకు ఘనస్వాగతం

హిందూపురం, మార్చి 30 : తెలుగుదేశం పార్టీ అనంతపురం పార్లమెంట్ అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించిన అనంతరం అంబికా లక్ష్మీనారాయణ శనివారం హిందూపురానికి వచ్చారు. కొడికొండ చెక్‌పోస్టుకు చేరుకున్న అంబికాకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వెళ్లి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొడికొండ చెక్‌పోస్టులో అంబికా విలేకరులతో మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ బడుగు బలహీనవర్గాల కోసం ఆవిర్భవించిందన్నారు. ఉమ్మడిజిల్లాలో వాల్మీకులకు టీడీపీ పెద్దపీట వేసిందన్నారు. మొదటి నుంచి వాల్మీకులు టీడీపీ వెంటే నడుస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురం నుంచి ఎమ్మె ల్యే బాలకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బడుగు బలహీనవర్గాలపై దాడులు పెరిగాయని, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. నిన్నటి వరకు పరదాల చాటున తిరిగిన ముఖ్యమంత్రి నేడు ఓట్లకోసం రోడ్డుబాట పట్టారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా అరాచకాలు, అఘాయిత్యాలు, దౌర్జన్యాలు, దందాలు, మానభంగాలు అధికమయ్యాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాలకృష్ణ అభిమానులు, వాల్మీకులు పాల్గొన్నారు.


అంబికాకు స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

కార్యకర్తలకు అండగా ఉంటా

- ఇక్కడ సింబల్ మాత్రమే మారింది.. మిగతాదంతా సేమ్ టూ సేమ్
- త్యాగం మాటల్లోనే కాదు.. చేతల్లో కూడా చూపించాం
- పార్టీ శ్రేణులతో పరిటాల శ్రీరామ్
- 4న ధర్మవరానికి సత్యకుమార్ రానున్నట్లు వెల్లడి


ధర్మవరంలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం/ బత్తలపల్లి మార్చి 30: ధర్మవరం నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలు, నాయకులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని, ఇక్కడ కేవలం సింబల్ మాత్రమే మారిందని, మిగిలినదంతా సేమ్ టు సేమ్ అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పొత్తులో భాగంగా ధర్మవరం టికెట్ బీజేపీకి కేటాయించిన నేపథ్యంలో నిరాశలో ఉన్న టీడీపీ శ్రేణులకు ఆయన ధైర్యాన్ని నింపారు. బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగనున్న సత్యకుమార్ ఏప్రిల్ 4వ తేదీన ధర్మవరానికి రానున్న నేపథ్యంలో శ్రీరామ్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ధర్మవరం పట్టణ, రూరల్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ధర్మవరం నియోజకవర్గం తనకు ఎన్నో పాఠాలు నేర్పిందన్నారు. పొత్తులో భాగంగా మనం టికెట్ త్యాగం చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దీంతో త్యాగం మాటల్లోనే కాదు.. చేత ల్లో చేసి చూపించామని పేర్కొన్నారు. దీనిని దురదృష్టంగా కాకుండా.. అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. పార్టీశ్రేణులు ఎవరూ అధైర్యపడకూడదని, తాను అండగా ఉంటానని పేర్కొన్నారు. కొంతమందిలాగా ఓడిపోగానే పార్టీలు మారి కార్యకర్తలను వదిలేసే టైపు కాదన్నారు. ఇక్కడ కేవలం సింబల్ మాత్రమే మారిందన్నారు. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యంగా సత్యకుమార్ జాతీయ స్థాయి నాయకుడని, అలాంటి వ్యక్తి మన ప్రాంతానికి రావడం మనకు ఎంతో మంచిదని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి చేసుకోవాలంటే సత్యకుమార్ ద్వారా మనం సాధించవచ్చన్నారు. బీజేపీ అభ్యర్థి రావడంతో మైనార్టీనేతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కడో జరిగిన ఘటనలు చూసి ఇక్కడ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఏప్రిల్ 4న సత్యకుమార్ ఘనస్వాగతం పలుకుదామని ఆయన పిలుపునిచ్చారు. అందుకు టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అదేవిధంగా బత్తలపల్లి మండలకేంద్రంలో కూడా పరిటాల శ్రీరామ్ బత్తలపల్లి, తాడిమర్రి మండలాల టీడీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించి ఈ మేరకు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం భ్రష్టు

- ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పల్లె విమర్శ


మీర్జాపురంలో ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

కొత్తచెరువు, మార్చి 30: వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా భ్రష్టు పట్టిందని, ఆ ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. మండలంలోని మీర్జాపురం గ్రామంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. తొలుత ఆయన గ్రామానికి చేరుకోగానే.. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం పల్లె ఇంటింటికీ వెళ్లి ప్రచారాన్ని చేపట్టారు. ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఆ పథకాల వల్ల ఎవరెవరికి ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులు మట్టి, ఇసుక, గ్రానైట్ ఇతర ఖనిజ దోపిడీ చేస్తూ అక్రమంగా ఆస్తులు కూడగట్టుకున్నారన్నారు. ఎవరైనా ఎదిరిస్తే వారిపై అక్రమ కేసులు బనాయించి వేధించారన్నారు. అభివృద్ధి మచ్చుకు కూడా కానరావడం లేదన్నారు. ఇలాంటి రాక్షస పరిపాలనను తరమికొడదామని పిలుపునిచ్చారు. చంద్రబాబు సీఎం అయితేనే మళ్లీ రాష్ట్రం గాడిన పడుతుందన్నారు. ముఖ్యంగా యువత భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. చంద్రబాబు పాలనలో కియా కార్లపరిశ్రమ వచ్చిందని, తద్వారా వేలాది మందికి ఉపాధి దొరికిందని ఈ సందర్భంగా పల్లె గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

టీడీపీలోకి 20 కుటుంబాలు చేరిక

కొత్తచెరువు: మండల కేంద్రంలోని బోయవీధికి చెందిన 20 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. పుట్టపర్తి పట్టణంలోని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి నివాసానికి శనివారం వారందరూ వచ్చి ఆయన సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో పల్లె సింధూరారెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. టీడీపీలోకి చేరిన ప్రతిఒక్కరికీ తగిన గుర్తింపు ఇస్తామని ఆయన పేర్కొన్నారు. జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు సమ ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అడపాల రామకృష్ణ, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, బండ్లపల్లిరాజు, కొండప్ప, గాజులచంద్ర, బీడుపల్లి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


పల్లె సమక్షంలో టీడీపీలోకి చేరుతున్న వైసీపీ నాయకులు

వైభవంగా భూతప్పల ఉత్సవం


భక్తులను దాటుకొని వెళ్తున్న భూతప్పలు

రొళ్ల, మార్చి 30: మండల కేంద్రంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి జాతర మహోత్సవంలో భాగంగా శనివారం భూతప్పల ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక లక్ష్మీనరసింహస్వామి, అభయాంజనేయస్వామి, భూతప్ప స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రొళ్ల కొండలో వెలిసిన ఉగ్రనరసింహస్వామిని పూజించారు. కొండపై నుంచి రొళ్ల మండల కేంద్రంలోని నరసింహస్వామి ఆలయం వరకు భూత ప్పల ఉత్సవాన్ని నిర్వహించారు. దారిలో అడ్డంగా పడుకున్న భక్తులను దాటు కుంటూ వచ్చే భూతప్పస్వామి కాలి స్పర్శతో తమ కోరికలు నెరవేరుతాయని ఇక్కడి అనాది ఆచారం. ఈ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మడకశిర సీఐ రాజకుమార్, రొళ్ల ఎస్ఐ రాజశేఖర్, గుడిబండ అమరాపురం ఎస్ఐలు, పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చెల్లని వీఐపీ పాస్‌లు


చెల్లని పాస్‌ను చూపుతున్న భక్తుడు

కదిరి, మార్చి 30: పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనృసింహస్వామి రథోత్సవం పూర్తి అయిన తరువాత తేరులో ఉన్న స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులను అనుమతించడం ఆనవాయితీ. వీఐపీల కోసం ఆలయాధికారులు పాసులు జారీ చేశారు. అయితే పోలీసులు, ఆలయాధికారుల సమన్వయ లోపంతో వీఐపీ పాసులను అనుమతించలేదు. పాసులను అనుమతించనప్పుడు వాటిని ఎందుకు జారీ చేశారని, వీఐపీ పాసులు తీసుకున్న భక్తులు ప్రశ్నించారు. పోలీసులు మాత్రం వీఐపీ పాసులిచ్చినట్లు తమకు సమాచారం లేదన్నారు. వీఐపీ పాసులు ఇచ్చినప్పుడు ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేసి, అనుమతించే అవకాశముంది. ఆలయాధికారులు, పోలీసులు సమన్వయ లోపం వల్ల వీఐపీ పాసులు చెల్లలేదు. దీంతో పాసులున్న వారు ఇబ్బందులు పడ్డారు.

రథోత్సవంలో ఇద్దరికి గాయాలు

కదిరిఅర్బన్, మార్చి 30: పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవంలో ఇరువురికి గాయాలయ్యాయి. తేరు వెనుక చక్రాలకు మొద్దులు వేసే సమయంలో కుటాగుళ్లకు చెందిన గంగరాజు కిందపడి కాలు విరిగింది. అదే గ్రామానికి చెందిన భానుప్రసాద్‌కు చేతికి గాయమైంది. వీరిని స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

పాలపాటి దిన్నె ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి

నల్లచెరువు, మార్చి 30: మండలంలో ప్రసిద్ధి గాంచిన పాలపాటిదిన్నె అంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయమే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేసి అలంకరించారు. అనంతరం అర్చనలు, పూజలు చేపట్టారు. ఆలయ ఆవరణలో భజన బృందం వారు భజనలు చేశారు. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవానికి హాజరైన భక్తులు చాలామంది ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడాలి: పల్లె

పుట్టపర్తి రూరల్, మార్చి 30: భగవంతుడి చల్లని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి అఖండవిజయం సాధించాలంటూ మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని బత్తలపల్లిలో గల రామాలయంలో శనివారం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్లె హాజరయ్యారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వచనాలు ఇచ్చారు. తర్వాత పల్లె మాట్లాడుతూ రాష్ట్రప్రజలందరిపై భగవంతుడి చల్లని ఆశీస్సులు ఉండాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అఖండవిజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని దేవున్ని కోరుకున్నట్లు తెలిపారు.

'కందికుంట విజయమే ధ్యేయం'


రామప్పకుంటతండాలో కార్యకర్తలతో మాట్లాడుతున్న బాగేపల్లి చలపతి

తనకల్లు, మార్చి 30: కదిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ విజయమే ధ్యేయంగా పని చేస్తామని కోటపల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బాగేపల్లి చలపతి పేర్కొన్నారు. మండలంలోని రాప్పకుంటతండా, కోటపల్లి గ్రామాల్లో శనివారం ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు కందికుంట వెంకటప్రసాద్ విజయానికి కృషి చేద్దామన్నారు. రానున్న 50రోజులు ప్రతి కార్యకర్త, నాయకుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ టీడీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని సూచించారు. సమస్యలుంటే ఎప్పటికపుడు నాయకత్వం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రథోత్సవంలో పటిష్ట బందోబస్తు

కదిరి, మార్చి30: పట్టణంలో లక్ష్మీ నృసింహస్వామి రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ శ్రీలత అధ్వర్యంలో సబ్‌డివిజన్ పరిధిలోని సిబ్బందితో పాటు పారామిలటరీ పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ముందస్తు జాగ్రత్తగా శుక్రవారం రాత్రి నుంచే ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. టవర్‌క్లాక్, కోనేరు, జీవిమాను సర్కిల్, వలిసాబ్‌రోడ్డులలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, తిరువీధుల్లోకి ఎటువంటి వాహనం ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

భక్తుల నిలువు దోపిడీ

కదిరి తేరుకు వచ్చిన భక్తులను ఆలయం వద్ద ఉన్న వ్యాపారులు నిలువుదోపిడీ చేస్తున్నట్లు పలువురు భక్తులు తెలిపారు. సెల్‌ఫోన్, బ్యాగులు ఉంచే క్లాక్‌రూం వద్ద మూడింతల ధరలు వసూలు చేసినట్లు వాపోయారు. ఒక బ్యాగు పెడితే రూ.10 వసూలు చేయాల్సి ఉండగా రూ.40 వసూలు చేసినట్లు చెప్పారు. సెల్ ఫోన్‌కు రూ.20 వసూలు చేసినట్లు మండిపడ్డారు. అదే విధంగా చెప్పుల స్టాండు వద్ద కూడా జతకు రూ.5 వసూలు చేయాల్సి ఉండగా.. రూ.10 వసూలు చేస్తున్నారన్నారు. ఇక తలనీలాలు ఇచ్చే చోట అయితే ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని, రూ.150 తక్కువ కాకుండా తీసుకుంటున్నారని ఆవేదన చెందారు.


తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

అంగన్‌వాడీ పరికరాల వితరణ


కలెక్టర్‌కు అంగన్‌వాడీ పరికరాలను అందజేస్తున్న హుండయ్ కంపెనీ ప్రతినిధులు

పుట్టపర్తి, మార్చి 30: కియ అనుబంధ సంస్థ హుండయ్ మోబిస్ కంపెనీ ప్రతినిధులు అంగన్‌వాడీ పరికరాలను కలెక్టర్ అరుణ్‌బాబుకు అందజేశారు. ప్లాంట్ హెడ్ హుహుమిన్ మేనేజర్ పీఎస్ శ్రీనివాసులు శనివారం కలెక్టర్‌ను జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో కలిసి రూ.44.13లక్షల విలువైన పరికరాలను అందజేశారు. ఇందులో చిన్నపిల్లల బరువు మిషన్లు , ఇన్‌ఫ్రెంటో మీటర్లు ,స్టేడియో మీటర్లు అందజేసినట్లు ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఐగా మల్లిక బాధ్యతలు

పుట్టపర్తి రూరల్, మార్చి 30: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో అన్నమయ్య జిల్లాలో ఆర్ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న మల్లిక సత్యసాయి జిల్లాకు వచ్చారు. జిల్లాకేంద్రంలో శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించి పోలీసుశాఖకు మంచిపేరు తేవాలని ఎస్పీ సూచించారు.

సూపర్ సిక్స్‌పై ప్రచారం


రామాపురం తండాలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

నంబులపూలకుంట, మార్చి 30: మండలంలోని రామాపురంతండా, ఎస్‌కేతండా, వడ్డిపల్లి,రామాపురం గ్రామాల్లో శనివారం టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు సీఎం అయితే ప్రతిఇంటికీ యేడాదికి మూడు సిలిండర్లు, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం కింద యేడాదికి రూ. 20వేలు, విద్యార్థులకు యేడాదికి రూ.15వేలు, మహిళలకు నెలకు రూ.15వందలు, 50యేళ్లు నిండిన బీసీలకు నెలకు రూ.4వేలు, అందించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని గెలిపించాలని వారు ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్ యాదవ్, విజయ్‌కుమార్‌యాదవ్, రఘునాథ్‌రెడ్డి, గంగిరెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా వేసిన మోటారు తొలగింపు

ఆంధ్రజ్యోతి స్పందన

కొత్తచెరువు, మార్చి 30: మండలంలోని తిరుమలదేవరపల్లి సమీపం చిత్రావతి నది దగ్గర్లో అక్కమ్మగారి గుడివద్ద పంచాయతీ బోరుకు వైసీపీ నాయకుడు మోటారు వేసుకుని నీటిని సొంతానికి వాడుకుంటుండంపై గత శనివారం పంచాయతీ బోరు ధారదత్తం అన్న వార్త ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు పంచాయతీ బోరుకు వైసీపీ నాయకుడు అక్రమంగా వేసుకున్న మోటారును తొలగించారు. పంచాయతీ బోరుకు సొంత మోటారు వేసుకోవడం నేరమని, ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ బోరును పంచాయతీ తాగునీటికి ఉపయోగిస్తామని ఆయన పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

బత్తలపల్లి, మార్చి 30: మండలంలోని గరశనపల్లి గ్రామానికి చెందిన యువకుడు అనిల్‌కుమార్(25)గత రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కాగా అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన అంకప్ప, బొజ్జమ్మల కు ముగ్గురు కూమారులు, ఒక కుమార్తె సంతానం. చిన్న కుమారుడు అనిల్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితం పై విరక్తి చెంది న అతను ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడని గ్రామస్థులు తెలిపారు.

వేలం డబ్బులు చెల్లించపోతే చర్యలు

కొత్తచెరువు, మార్చి 30: గ్రామ పంచాయతీలోని వారపుసంత, దిన సంత, బస్టాండ్‌లో సుంకం వసూళ్లు చేసుకోవడానికి వేలం పాటలు పాడిన వారు బకాయిలను చెల్లించాలని, లేకపోతే చర్యలు తప్పవని పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సురేంద్రనాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ సిద్ధారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దిన సంత సుంకం వసూలు చేయడానికి వంశీకృష్ణ అనే వ్యక్తి రూ.4.78లక్షలకు వేలంపాట పాడారని, అయితే అతను పంచాయతీకి డబ్బులు చెల్లించలేదని అన్నారు. అదేవిధంగా బళ్లారి బాబు అనే వ్యక్తి రూ.6.7లక్షలకు బస్టాండ్‌లో సుంకం వసూళ్లు చేసుకోవడానికి వేలంపాట పాడారని, అతను కూడా ఇప్పటివరకు గ్రామ పంచాయతీకి డబ్బులు చెల్లించలేదని తెలిపారు. వారపు సంత ఎం.నారాయణ రూ.14.35లక్షలకు వేలం పాట పాడారని, ఈయన రూ.6లక్షలు మాత్రమే చెల్లించారని, మిగిలిన రూ.8.35లక్షలు ఇప్పటివరకు చెల్లించలేదని అన్నారు. దీంతో వారికి నోటీసులు జారీ చేశామన్నారు. పంచాయతీకి వేలం పాట డబ్బులు చెల్లించకపోతే భవిష్యత్తులో వారు గ్రామ పంచాయతీలో ఎలాంటి వేలం పాటలకు పాల్గొనకుండా అనర్హులుగా గుర్తించడం జరుగుతుందన్నారు. వేలం పాట డబ్బులు చెల్లించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పంచాయతీ యాక్ట్ ప్రకారం కోర్టులో కేసు వేస్తామని వారు పేర్కొన్నారు.

స్పాట్‌ను బహిష్కరిస్తాం: ఏపీటీఎఫ్

కొత్తచెరువు, మార్చి 30: పదో తరగతి మూల్యాంకనం సోమవారం నుంచి జరగనుందని, ఆ కార్యక్రమాన్ని బహిష్కరిస్తామని ఏపీటీఎఫ్ నాయకులు పీవీ మాధవ, ఆర్ చంద్ర, కోడూరు శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరంలో నిర్వహించిన స్పాట్ వాల్యూయేషన్, పరీక్షల నిర్వహణలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు డబ్బులు దాదాపు జిల్లా వ్యాప్తంగా రూ.23లక్షలు రావాల్సి ఉందన్నారు. అయితే ఏడాది దాటి పోయి మరలా 10వ తరగతి మూల్యాంకనం ప్రారంభమవుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వం డబ్బులు విడుదల చేయలేదన్నారు. అలాంటప్పుడు తాము స్పాట్ వాల్యూయేషన్‌కు ఎందుకు రావాలని వారు ప్రశ్నించారు. అదేవిధంగా 55 ఏళ్ల వయసు దాటిన వారిని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడే వారిని, చిన్నపిల్లల తల్లులను స్పాట్ వాల్యూయేషన్ నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

అడుగడుగునా.. అన్నదాన కేంద్రాలు

- భక్తుల ఆకలి, దప్పిక తీర్చిన స్థానికులు

కదిరిఅర్బన్, మార్చి 30: పట్టణంలో ఖాద్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మరథోత్సవం సందర్భంగా శనివారం లక్షలాదిగా తరలి వచ్చిన భక్తులకు స్థానికులు అడుగడుగునా ఆతిథ్యం ఇచ్చి ఔదార్యం చాటుకున్నారు. దాదాపు 100 మందికి పైగా దాతలు షామియానాలు వేసి.. వీధి వీధికి అన్నదాన కేంద్రాలు, మజ్జిగ, తాగునీటి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మిద్దెల పైన సైతం షామియానాలు వేసి ఎండ బారి నుంచి భక్తులకు ఉపశమనం కల్పించారు. గొల్ల మండపంలో అయ్యప్ప భక్తమండలి వారు శుక్రవారం రాత్రి నుంచే అన్నదానం చేపట్టారు. పట్టణంలో ఎప్పుడూ లేనంతగా విరివిగా అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేశారు. శ్రీవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులను పిలిచి మరీ భోజనాలు వడ్డించారు. మజ్జిగ , వాటర్ ప్యాకెట్లు అందజేశారు.

కిటకిటలాడిన దుకాణాలు...

శ్రీవారి రథోత్సవం సందర్భంగా పట్టణంలో దుకాణాలు కిటకిటలాడాయి. ముఖ్యంగా స్వామివారి రథంపై చల్లే దవణం, మిరియాలు, పసుపు, కుంకుమలకు బాగా గిరాకీ ఏర్పడింది. శ్రీవారికి భక్తులు సమర్పించేది దవణం, మిరియాలే. వీధులన్నీ కదిరి దవణం, మల్లెల సువాసనలతో ఘుమఘుమలాడాయి. తిరుగు ప్రయాణంలో భక్తులు చిన్నపిల్లల కోసం ఆటబొమ్మలు, బొరుగులు, బత్తాసులు, బెండ్లు, లడ్డూలు, జిలేబీ వంటి తినుబండారాలు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. అలాగే ఆడపడుచులకు ఇవ్వడానికి గాజులు, కుంకుమను కొనుగోలు చేసి తీసుకెళ్లారు.




భక్తులకు అన్నదానం చేస్తున్న స్థానికులు..


గాజులు కొనుగోలు చేస్తున్న భక్తులు


కుంకుమను విక్రయిస్తున్న మహిళ


ఆటబొమ్మల దుకాణం

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

మడకశిరటౌన్, మార్చి 30: పాలిసెట్-2024కు దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులకు సోమవారం నుంచి ఏప్రిల్ 25వ తేదీ వరకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు మడకశిర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు పూర్తి చేసుకొని పాలిసెట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు కే గుండుమల గ్రామంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పాలిటెక్ ప్రవేశానికి ఏప్రిల్ 27వ తేదీన పరీక్ష జరగనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నంబర్లు 9492660993, 9866631405ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

నీటి సంరక్షణపై అవగాహన

రొద్దం, మార్చి 30 : సమాజంలో నీటిని పొదుపుగా వాడుకుని భవిష్యత్ తరాలకు వినియోగించుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి హరి పేర్కొన్నారు. సానిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటివద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షపు నీటిని వడిసిపట్టి భవిష్యత్తరాలకు వినియోగించుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ గౌడ్, జనవిజ్ఞాన వేదిక జోన్ ఎడ్యుకేషన్ వింగ్ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, నారాయణస్వామి, కృష్ణానాయక్, మోహన్‌రెడ్డి, లక్ష్మీనరసమ్మ, జయమ్మ, సత్యమయ్య, లక్ష్మీనారాయణ, మహబూబ్‌బాష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

పావగడ, మార్చి 30: రానున్న పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఓటుహక్కుపై తాలూకా పంచాయతీ కార్యాలయంలో శనివారం అధికారులు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఏప్రిల్ 9వతేదీ వరకు ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసేందుకు అవకాశం ఉందన్నారు. అధికారులు, సంబంధిత బీఎల్‌ఓలు బాధ్యత వహించాలని ఈఓ జానకిరామ్ తెలియజేశారు. పట్టణ వ్యాప్తంగా ఓటుహక్కుపై ర్యాలీ నిర్వహించి పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల జోక్యంతో తల్లి అంత్యక్రియలు

పెనుకొండ టౌన్, మార్చి 30 : సోమందేపల్లి మండలం ఓబుళదేవరపల్లిలో ఉప్పర గంగమ్మ(65) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతిచెందింది. ఆమెకు ముగ్గురు కొడుకులు ఉన్నా నగదు విషయమై ఆమె అంత్యక్రియలను పట్టించుకోలేదు. చివరకు పోలీసుల జోక్యంతో అంత్యక్రియలు జరిగాయి. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఉప్పర గంగమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఆమెకు భర్త లక్ష్మయ్య, ముగ్గురు కుమారులు నరసింహులు, అంజనేయులు, గంగాధర్ ఉన్నారు. అయితే ఆమె వద్ద ఉన్న రూ.3లక్షల నగదును నువ్వు తీసుకున్నావంటే నీవు తీసుకున్నావంటూ శనివారం వాగ్వాదం చేసుకున్నారు. ఆమె అంత్యక్రియలను పట్టించుకోలేదు. ఈ సంఘటన గ్రామస్థులను కలిచి వేసింది. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు స్థానిక వీఆర్‌ఓ, సెక్రటరీ సమక్షంలో పోలీసులు ఆ ముగ్గురికి సర్దిచెప్పి, కుటుంబ సభ్యులతోనే అంత్యక్రియలు చేయించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


శివలక్ష్మి (ఫైల్)

రొద్దం, మార్చి 30 : మండలపరిధిలోని తాడంగిపల్లికి చెందిన శివలక్ష్మి (25) అనే మహిల ఇంటి పైకప్పుపై క్యూరింగ్ కోసం నీళ్లు పడుతుండగా విద్యుదాఘాతమై మృతి చెందింది. గ్రామానికి చెందిన నాగేంద్ర భార్య శివలక్ష్మి. ఆ కుటుంబానికి ఆర్డీటీ ఇల్లు మంజూరు చేయగా నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో శివలక్ష్మి శనివారం ఉదయం 10గంటల సమయంలో ఇంటి పైకప్పుపై క్యూరింగ్ కోసం నీళ్లు పడుతోంది. ప్రమాదవశాత్తు ఇంటిపైకప్పుపై చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను తాకడంతో విద్యుదాఘాతానికి గురైంది. అదే వైర్లపై ఆమె పడిపోయింది. గమనించిన స్థానికులు హుటాహుటిన కరెంట్ సరఫరా ఆఫ్ చేయించారు. ఆమెను కిందికి దించి పావగడ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. గ్రామస్థులు రొద్దం పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. మృతురాలికి భర్త నాగేంద్ర ఉన్నాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మరో చోట వ్యక్తికి అస్వస్థత...

గోరంట్ల, మార్చి 30: పట్టణంలోని ఓ నివాస గృహానికి శనివారం విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్న నవీన్ అనే ప్రైవేటు ఎలెక్ట్రీషియన్ విద్యుదాఘాతంతో అస్వస్థకు గురయ్యారు. పుట్టపర్తి మండలంలోని పెడబల్లికి చెందిన వెంకటేశ్ కుమారుడు నవీన్ ప్రైవేటు ఎలెక్ట్రీషి యన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గోరంట్ల పట్టణంలోని ఓ ఇంట్లో పనిచేస్తున్న సమయం లో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతడిని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ వినోదకుమార్ అతడికి ప్రాథమికి చికిత్సలు అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తీసుకెళ్లాలని సూచించారు. ప్రమాద సంఘటనపై ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసును అడుగగా, ప్రమాదానికి సంబంధించి తమకు సమాచారం లేదన్నారు.

సరిహద్దులో గట్టి బందోబస్తు : ఎస్ఐ


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ వీరేష్, సిబ్బంది

అగళి, మార్చి 30 : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టుల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాలైన రావుడి, పీ బ్యాడిగెర, బొమ్మరసనపల్లి వద్ద ఏర్పాటు చేశామన్నారు. వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో నగదు, బంగారు ఆభరణాలు, కర్ణాటక మద్యం రవాణాను, మండలంలో జూదం, మట్కా తదితర వా టిని అరికడతామన్నారు. గ్రామాలలో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో రాత్రిళ్లు పోలీస్ గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం పీ బ్యాడిగెరవద్ద వాహనాలను తనిఖీ చేశారు.

'సూపర్‌సిక్స్'తో ప్రతి ఇంటికీ ప్రయోజనం

● చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షం
●ఎంపీ అభ్యర్థి బీకే, ఎమ్మెల్యే అభ్యర్థి సవిత


ప్రచారంలో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

పెనుకొండ రూరల్, మార్చి 30 : తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి ఇంటికి ప్రయోజనం చేకూరుతుందని, చంద్రబాబు తోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆ పార్టీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. వారు శనివారం మండలంలోని శెట్టిపల్లి, బొజ్జిరెడ్డిపల్లి, బాపనకాలువ తదితర ప్రాంతాల్లో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులతో కలిసి జనసంద్రం మధ్య ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో పార్థసారథి, సవిత మాట్లాడుతూ... చుట్టు పక్కల గ్రామాల ప్రజలు శెట్టిపల్లికి రావలంటే వంకను దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఇది గమనించి గత తెలు గుదేశం పార్టీ హయాంలో బ్రిడ్జిని నిర్మించి అభివృద్ధి అంటే ఏంటో చూపించా మన్నారు. బ్రిడ్జి నిర్మించి దశాబ్దాల కల నెరవేర్చిన ఘనత టీడీపీకే దక్కుతుం దన్నారు. అభివృద్ధి ఎవరు చేశారో వారికే పట్టం కట్టాలని కోరారు. వైసీపీ పాలన లో రాష్ట్రం సర్వనాశనం అవుతోందని గ్రహించిన అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబు రాకకోసం ఎదురుచూస్తున్నార న్నారు. తను చేసిన మోసాన్ని టీడీపీ అంటగట్టి చెప్పిన మాటే వందసార్లు చెప్పడం జగన్ నైజమన్నారు. మద్య నిషేధం చేస్తా మని ఎన్నికల ముందు చెప్పిన జగన్, అధికారంలోకి వచ్చాక ఆ మద్యంతోనే వేల కోట్లు దోచుకుని ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. విద్యుత్ చార్జీలు పెంచి రైతులు, ప్రజలపై కోట్ల రూపాయలు భారం వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని అసమర్థ జగన్ అని అభివర్ణించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సాగు, తాగునీటితో పాటు రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు రావాలన్నా చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మార్పు కోరుకుంటున్న రాష్ట్ర ప్రజలు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

మడకశిరటౌన్, మార్చి 30: రాష్ట్రంలో ప్రజలు అధికార మార్పు కోరుకుంటున్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్ అధికార దాహంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. ఆయన శనివారం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్నతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవ్యాంధ్రను జగన్ అప్పులు ఆంధ్రగా మార్చారని, రాష్ట్రంలో పరిశ్రమలు లేక యువత ఉపాధి అవకాశాలు కరువై ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు సంపదను సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తారన్నారు. వైసీపీ పాలనలో కనీసం ఉద్యోగులకు నెల నెలా జీతాలు, పెన్షన్లు అందించలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలపై దాడులు అధికంగా జరుగుతున్నాయని, శాంతి భద్రతలు దారి తప్పాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏ మొహం పెట్టుకొని పర్యటిస్తారని ప్రశ్నించారు. జిల్లాలో తీవ్ర కరవు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అయినా కనీసం పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటివి రైతులకు అందించి ఆదుకొన్న దాఖలాలు లేవన్నారు. ఏడు సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. ఈసందర్భంగా వక్కలిగ సాధికార రాష్ట్ర కన్వీనర్ వీఎం పాండురంగప్ప, మాజీ ఎంపీపీ ఆదినారాయణ, టీడీపీ మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తరహళ్లిలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మడకశిర రూరల్, మార్చి 30: మండలంలో ప్రసిద్ధి చెందిన భక్తరహళ్లి నర సింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయాల్లో మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం చేకూర్చారు. ఈ సందర్భంగా ఈరన్న మాట్లాడుతూ... టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పార్టీని గెలిపించి చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిని చేయడంకోసం ప్రతి గ్రామంలో అహర్నిశలు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండురంగప్ప, ఆదినారాయణ. అశ్వత్థామప్ప, రామాంజనేయులు, కిష్టప్ప, రాజగోపాల్, బొజ్జప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్ర గాయాలు

గోరంట్ల, మార్చి 30: మండల పరిధిలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు తీవ్రంగా గాయడ్డారు. పుల్లేరు సమీపంలోని కల్వర్టు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో అనసూయమ్మ, రెడ్డిశేఖర్ దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. సోమగట్టుకు చెందిన వారు బంధువైన మరో మహిళతో కలిసి ముగ్గురు ద్విచక్రవాహనంపై కదిరి తిరునాళ్లకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అనసూయమ్మ, రెడ్డి శేఖర్‌కు గాయాలు కాగా మరో మహిళ సురక్షితంగా బయపడింది. గాయపడినవారిని గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు. అలాగే మండలంలోని మలుపు వద్ద ఆటో బోల్తాపడి లక్ష్మీదేవమ్మ, కిష్టప్ప, రవీంద్రారెడ్డి గాయపడ్డారు. ఓడీసీ మండలంలోని నవాబు కోటకు చెందిన వారు గోరంట్ల మండలంలో ఓ శుభకార్యక్రమానికి హాజరై, తిరుగు ప్రయాణంలో ఆటోలో వెళ్తున్నారు. ఎర్రయ్యగారిపల్లి మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో వెళ్తున్న లక్ష్మీదేవమ్మ, కిష్టప్ప, రవీంద్రారెడ్డి గాయపడ్డారు. వారిని గోరంట్ల ప్రభుత్వ ఆసపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించడానికి 108 కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అది అమడగూరు ప్రాంతంలో ఉందని, గంటకు పైగా సమయం పడుతుందని సమాచారం వచ్చింది. లక్ష్మీదేవమ్మకు కుడిచేయి మణికట్టు విరిగి తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో ఆమెను, కిష్టప్పను ప్రత్యేక వాహనంలో హిందూపురం తీసుకెళ్లారు. రవీంద్రారెడ్డి మరో ప్రయివేటు వాహనంలో వెళ్లారు.

దివాలా తీసిన రాష్ట్రానికి ఆపద్బాంధవుడు బాబు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 30: ఒక్క ఛాన్స్‌తో ముఖ్యమంత్రి అయిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని దీవాలా తీశాడని, అలాంటి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లే నాయకుడు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడే అని పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు మా ర్పు కోరుకుంటున్నారని రాబోవు ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. ఈ సైకో పాలనలో ఏపీ ప్రజలు చాలా కష్టాలు పడ్డారన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుకు కావాల్సిన నమ్మకం, వారికి భరోసా ఈ జగన్‌రెడ్డి ఈ జన్మలో ఇవ్వలేడన్నారు. ఈ ఐదేళ్లలో ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు, పెన్షన్ ఇచ్చిన పాపాన పోలేదన్నారు. అధికారం వచ్చినప్పటి నుంచి తొమ్మిది సార్లు కరెంటు ధరలు పెంచాడని, పేదవాడి కడుపు నింపే అన్న క్యాంటీన్‌లను మూయించాడన్నారు. ఇప్పటికే ఇంటింటి ప్రచారం విస్తృతంగా చేస్తున్నామని, ప్రజల ఆదరణ చూస్తుంటే వారు జగన్‌ను తరమి కొట్టడం ఖాయమన్నారు.

సొంత గూటికి నాయకులు


కండువావేసి టీడీపీలో ఆహ్వానిస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

హిందూపురం, మార్చి 30 : వైసీపీలో కీలకంగా పనిచేస్తున్న తూముకుంట మూర్తితోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద శనివారం వారికి టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డి పార్టీ కండువావేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాలవల్ల వైసీపీలోకి వెళ్లామని అయితే బాలకృష్ణ గతంలో చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని తిరిగి వచ్చామన్నారు. బాలకృష్ణను అధిక మెజార్టీతో గెలిపించేందుకు సహకారం అందిస్తామన్నారు. నాయకులు శ్రీరాములు, మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణాచల్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, ప్రదీప్, టీజీ నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్ర దీప్, హనుమంతరాయుడు, చిక్కిరప్ప, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గుడారం దగ్ధం


కాలిపోతున్న గుడారం

గోరంట్ల, మార్చి 30: పట్టణంలోని పుల్లేరు రహదారిలో సంచార జాతులవారు ఏర్పాటు చేసుకున్న గుడారం శనివారం అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. దీంతో రూ. రెండు లక్షలు ఆస్తినష్టం జరిగినట్టు బాధితులు వాపోయారు. బాధితురాలు రామక్క తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి చిలమత్తూరు మండలంలోని కోదూరుకు చెందిన రామక్క, ఆంజనప్ప దంపతులు 20యేళ్ల కిందట గోరంట్లకు వచ్చి ఇతరుల స్థలంలో డేరా వేసుకున్నారు. ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి ఉంటున్నారు. పిల్లలు ఆడుకునే ఆటవస్తువులు, బొమ్మలను గ్రామాల్లో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ మల్లాపల్లి లేఅవుట్‌లో ఇంటి స్థలం కేటాయించింది. నిర్మాణ పనులుజరుగుతున్నాయి. అంజనప్ప బెంగుళూరు వెళ్లగా, గుడారంలో ఎవరూ లేని సమయంలో శనివారం సాయంత్రం ఉన్నఫలంగా అగ్నిప్రమాదం సంభవించి పూర్తిగా కాలిపోయింది. గుడారంలో బీరువాతోపాటు, టీవీ, రూ.40వేలు నగదు, బంగారు ఆభరణాలు, నిత్యావసర వస్తువులు, ఇంటి పట్టా, ఆధార్, రేషన్ కార్డు తదితరాలన్నీ కాలిబూడిదైనట్లు రామక్క తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే గుడారంలోని సిలిండర్‌ను కొంతమంది బయటకు తెవడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అంధకారంలో గ్రామాలు


శనివారం రాత్రి అంధకారంలో ఉన్న కోనాపురం

పెనుకొండ రూరల్, మార్చి 30: మండల పరిధిలోని కోనాపురం, ఇస్లాపురం, మంగాపురం, వెంకటరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆ గ్రామాల్లో ప్రజలు అంధకారంలో ఉండిపోయారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటలు దాటినా విద్యుత్ సరఫరా కాలేదు. దీంతో ఎండవేడిమికి, ఉక్కపోతకు చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైసీపీ పాలనలో తరచూ విద్యుత్ కోతలతో ప్రజలు, రైతులు నానా ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ పరమేశ్వరరెడ్డిని వివరణ కోరగా స్థానిక కియ పరిశ్రమకు వెళ్లే విద్యుత్ లైన్ నుంచి వచ్చే 11 కేవీ లైన్ నుంచి విద్యుత్ సరఫరా ఆగిపోయిందన్నారు. దీంతో ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. మరమ్మతుల కోసం చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

భక్తుల నిలువు దోపిడీ

కదిరి, మార్చి30: కదిరి తేరుకు వచ్చిన భక్తులను ఆలయం వద్ద ఉన్న వ్యాపారులు నిలువుదోపిడీ చేస్తున్నట్లు పలువురు భక్తులు తెలిపారు. సెల్‌ఫోన్, బ్యాగులు ఉంచే క్లాక్‌రూం వద్ద మూడింతల ధరలు వసూలు చేసినట్లు వాపోయారు. ఒక బ్యాగు పెడితే రూ.10 వసూలు చేయాల్సి ఉండగా రూ.40 వసూలు చేసినట్లు చెప్పారు. సెల్ ఫోన్‌కు రూ.20 వసూలు చేసినట్లు మండిపడ్డారు. అదే విధంగా చెప్పుల స్టాండు వద్ద కూడా జతకు రూ.5 వసూలు చేయాల్సి ఉండగా.. రూ.10 వసూలు చేస్తున్నారన్నారు. తలనీలాలు ఇచ్చే చోట ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని, రూ.150 తక్కువ కాకుండా తీసుకుంటున్నారన్నారు.

రథోత్సవంలో ఇద్దరికి గాయాలు

కదిరిఅర్బన్, మార్చి 30: పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవంలో ఇరువురికి గాయాలయ్యాయి. తేరు వెనుక మొద్దులు వేసే సమయంలో కుటాగుళ్లకు చెందిన గంగరాజు, అదే గ్రామానికి చెందిన భానుప్రసాద్‌కు గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భక్తుల సేవలో గోరంట్ల వాసులు

గోరంట్ల, మార్చి 30:

కదిరి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సందర్భంగా దర్శనానికి వెళ్తున్న భక్తుల సౌకర్యార్థ గోరంట్లలో శనివారం పలువురు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బస్టాండ్ కూడలిలోని దాముర్లోడ్డులో అయ్యప్పస్వా మి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రయాణికులకు అన్నదానం చేపట్టారు. వీరు ఇక్కడ ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ముద్దల వెంకట రాముడు, బాలాజీ బస్టాండ్ కూడలిలో మజ్జిగ అందించారు. అలాగే 1989-90లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు వాటర్ ప్యాకెట్లు అందించారు. బస్సుల వద్దకు వెళ్లి వాటర్ ప్యాకెట్లను ప్రయాణీకులకు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చింతకాయల వెంకటేష్, సుధాకర్, జయచంద్రారెడ్డి, ఆనంద్, క్రిష్టారెడ్డి సేవాలో పాల్గొన్నారు.


బస్టాండ్ కూడలిలో అయ్యప్ప సేవా సమితి అన్నదానం


మజ్జిగ పంపిణీ


వాటర్ ప్యాకెట్ల పంపిణీ

వైభవంగా భూతప్పల ఉత్సవం


భక్తులను దాటుకొని వెళ్తున్న భూతప్పలు

రొళ్ల, మార్చి 30: మండల కేంద్రంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి జాతర మహోత్సవంలో భాగంగా శనివారం భూతప్పల ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక లక్ష్మీనరసింహస్వామి, అభయాంజనేయస్వామి, భూతప్ప స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రొళ్ల కొండలో వెలిసిన ఉగ్రనరసింహస్వామిని పూజించారు. కొండపై నుంచి రొళ్ల మండల కేంద్రంలోని నరసింహస్వామి ఆలయం వరకు భూత ప్పల ఉత్సవాన్ని నిర్వహించారు. దారిలో అడ్డంగా పడుకున్న భక్తులను దాటు కుంటూ వచ్చే భూతప్పస్వామి కాలి స్పర్శతో తమ కోరికలు నెరవేరుతాయని ఇక్కడి అనాది ఆచారం. ఈ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మడకశిర సీఐ రాజకుమార్, రొళ్ల ఎస్ఐ రాజశేఖర్, గుడిబండ అమరాపురం ఎస్ఐలు, పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గిరిజనులను గుర్తించింది టీడీపీనే : నాయకులు


ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

హిందూపురం, మార్చి 30 : గిరిజనులను గుర్తించి వారికి సంక్షేమ ఫలాలు అందించింది తెలుగుదేశం పార్టీ అని ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్రబాబు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు శనివారం ఆదెప్పల్లితండాలో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల క్యాలెండర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు తెలుగుదేశం పార్టీ పెద్ద పీట వేసిందని, వారున్న ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. నందమూరి బాలకృష్ణ కూడా నియోజకవర్గంలో ఉన్న గిరిజనులకు ప్రత్యేక పథకాలు కల్పించారని గుర్తుచేశారు. భవిష్యత్తులో గిరిజనులకు పెద్దపీట వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నందీశ్, అశ్వత్థప్ప, ఆదినారాయణ, ఆంజనేయులు, చంద్ర మోహన్, శివ, జయచంద్రారెడ్డి, శ్రీనివాసులు, రాము, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డం తండాలో ప్రచారం


తండాలో ప్రచారం చేస్తున్న దృశ్యం

గోరంట్ల, మార్చి 30: మండలంలోని గడ్డంతండా పంచాయతీలో టీడీపీ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే తండాలో ఇంటింటికెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ పురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సవిత తరఫున ప్రచారం సాగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీఎన్ఎస్ఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు షణ్ముకనాయక్, తరుణ్, పాం దురంగ, చలపతి, గోవిందునాయక్, రామునాయక్,బీమా నాయక్, సతీష్ నాయక, బాలాజీ, మంజునాథ్, జగదీష్‌నాయక్ తదితరులున్నారు.

టీడీపీతో ఇంటింటికి సంక్షేమం


కోడూరు ఎస్సీ కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, మార్చి 30: ప్రతి కుటుంబానికి సంక్షేమంతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కోడూరు ఎస్సీ కాలనీలో శనివారం నాయకులు శ్రీదేవి, బేకరీ గంగాధర్, మీసేవ సూరి, సూర్యనారాయణ, గంగాధర, కిష్టప్ప, లింగప్ప, గంగాధర్, శివ, ఉరుము నంజుండ, వెంకట సుబ్బయ్య తదితరులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటి వద్దకు వెళ్లి టీడీపీ అధికారంలోకి వేస్తే అమలుచేసే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది.

తాగునీటి సమస్య పరిష్కరించుకున్న గ్రామస్థులు


మోటారుకు మరమ్మతులు చేస్తున్న ముత్తేపల్లి గ్రామస్థులు

అగళి, మార్చి 30 : మండలంలోని ముత్తేపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్య అందరం కలిసి పరిష్కరించుకున్నామని ఆ గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా ఆ గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. పాత బో రులో నీటి మట్టం తగ్గిపోవడంతో పాటు అందులో ఉన్న మోటారు కాలిపోయిందన్నారు. కొత్తగా బోరు వేస్తే అరకొరగా వచ్చిందని తెలిపారు. దిక్కుతోచని స్థితిలో గ్రామస్థుల నుంచి రూ.70వేలు చందాల రూపంలో వసూలు చేసుకుని చెడిపోయిన మోటారుకు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. అలాగే అరకొరగా నీరు వస్తున్న కొత్తబోరుకు మరో మోటారు బిగించామన్నారు. ఆ రెండు బోర్లుకు మోటార్లు బిగించడంతో నీరు పుష్కలంగా వస్తున్నాయని ఆ గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.